కథానిక

# "ఎక్స్‌రే" కళ్ళు

కొండేపూడి సూర్యకామరాజు

వాళ్లు మెట్లుదిగి రోడ్డుమీదకు వచ్చేటప్పటికి ఎదురుగా సిద్ధమైంది, మాసిన పంజాబీ దుస్తుల్లో వున్న పదహారేళ్ల పిల్ల. ఎందుకన్నట్లు కళ్లు పెద్దవిచేసి చూశారు వాళ్లు.

'ట్యుటోరియల్ కాలేజిలో మెట్రిక్ కి చదువుతున్నా, పరీక్షకు పదిహేను రూపాయిలు కట్టాలి. మీరు నాకు సహాయం చేస్తే మీకు ఋణపడి వుంటాను!' చాలా దీనంగా అడిగింది.

'మేమేదో అర్జంటు పనిమీద పోతుంటె మమ్మల్నెందుకు బాధిస్తావ్? తర్వాత ఎప్పుడన్నా కనపడు'! ఉమేష్ అన్నాడు టైము చూసుకుంటూ.

'రేపటిదాకానే గడువు. ఎల్లుండి డబ్బు దొరికినా లాభంలేదు.'

ఆ పిల్లకు సహాయం చేద్దామని వాళ్ళకు వుంటేగా.

'స్వంత వూళ్లనీ, తల్లిదండ్రుల్నీ వదలివచ్చిన మేమూ యించుమించు నీపరిస్థితుల్లో నేవున్నాం. మామీదేం ఆశపెట్టుకోకు!' అని ఎంతో చింత వున్నవాడిలా సీను అనడంతోనే పంజాబీ పిల్ల కళ్లు నీళ్లతో నిండినై. మర్యాదకు భంగం రానంతదూరంలో ఆ పిల్లని తప్పించుకుని వాళ్లు నలుగురూ నడిచిపోయారు.

ఇదంతా పక్క యింటి మేడమీదనించి రాజు చూస్తూనే వున్నాడు. వెంటనే రోడ్డు మీదకువచ్చి ఆ అమ్మాయితో అన్నాడు-

'నీకేం కావాలి?'

'డబ్బు.'

'ఎంత?'

'పదిహేను.'

'ఎందుకూ?'

ఆమె చెప్పింది: వెంటనే రెండు పది రూపాయిల నోట్లను ఆ రెఫ్యూజీ చేతులో పెట్టి వెళ్లి పోయాడు.

ఇది జరిగిన మూడున్నర గంటల తర్వాత అంటే రాత్రి పది గంటలకు సీనూవాళ్లూ రొప్పుకుంటూ రాజుదగ్గరకు వచ్చిపడ్డారు. జరిగిందేమిటంటే వాళ్లు శేష్‌మహల్ సినిమా చూసి వచ్చేలోగా సీను రిస్టువాచీ, ఉమేష్ ఉంగరం, అనంతరంఆలారంటైంపీస్, పాపారావుఫ్లాస్కూ కాక అందరిదీకలిసి అయిదువందల తొంభైమూడు రూపాయిల ఏడణాలన్నర ఎగిరిపోయింది. అది విని రాజు విచారంకాని, ఆశ్చర్యం కాని ప్రదర్శించలేదు.

'లాడ్జి ఖాళీగా వదలి అందరూ కట్టకట్టుకుని బుద్ధిలేకుండా సినిమాకు పోయేవాళ్ళకు ఆమాత్రం శాస్తి జరగ వలసిందే'అనిమాత్రం అన్నాడు.

అతడి నిర్లక్ష్యం చూసి వాళ్ళకు కోపం వచ్చింది.

ఎన్నిసార్లు వెళ్లలేదూ? ఈవాళే జరగాలా?' సీను విసుక్కుంటూ అన్నాడు.

'దొంగతనంచేసి వాళ్ళ ముందు అల్టిమేటం యిస్తారనుకున్నావా? - మొన్న మెడికల్ కాలేజీ హాస్టల్లో అరగంట వ్యవధిలో పెట్టెలో వున్న అయిదు రూపాయిలు పోయినై. అంతటితో సరిపోయిందా - డబ్బు పోగొట్టుకున్న అమ్మాయి తన రూమ్ మేట్ మీద అనుమాన పడిందిట. ఆ రూమ్ మేట్ ,అవమానం భరించలేక సూయిసైడ్ చేసుకోటానికూడా సిద్ధపడింది. చూడండి, అజాగ్రత్తగా వున్నందువల్ల డబ్బు పోవటమే కాకుండా ఎన్ని అసహ్యకరమైన పరిస్థితు లేర్పడుతయో. మీకు రోజూ చెప్తూనేవున్నాను, జాగ్రత్తగా వుండండ్రా అని.

'డబ్బుపోయి ఏడుస్తోన్న మమల్ని ఎత్తి పొడవకపోతే- షెర్లాక్ హోమ్స్ శిష్యుడివనీ, ఎక్స్‌రేకళ్ళనీ కోస్తూంటావే - దొంగని కొంచెం ట్రేస్ చెయ్యకూడదూ?' అనంతం అన్నాడు.

'వాడు దొరసాన్ని ట్రేస్ చేస్తాడు కాని దొంగల్ని ట్రేస్ చేస్తే వాడి డిగ్నిటీకి భంగం కాదూ!' అని సీను నాలిక కరుచుకున్నాడు.

రాజుకి వొళ్లు మండిపోయింది. కోపంతో అన్నాడు—

'దొంగలు పడి యిల్లంతా దోచుకుంటే కాస్సేపు తనివితీరా ఏడవక పైగా వేళాకోళాలూ, ఎకసక్కాలూనూ. మిమ్మల్ని చూసి మీరే సిగ్గుపడాలి.'

'బ్రదర్, అందరూ నీలాగే పెస్సిమిస్టిక్‌గా వుంటారనుకోకు. డబ్బుపోయినా వచ్చినా ఒకే విధంగా ఆనందిస్తాం. కష్టమొచ్చినా, సుఖమొచ్చినా చిరునవ్వుతో స్వీకరిస్తాం-ఫిలాసఫీ ఆనర్సు తెలుసా' అంటూ సీను రాజు వీపు తట్టాడు.

'ఎకనమిక్స్ ఆనర్సు ఏడుస్తోన్న వాపారావు ఎకానమీ ఎట్లా ఏడుస్తోందో నీ ఫిలాసఫీ కూడా అట్లాగే ఏడుస్తోంది- అవును. డబ్బు పోతే నీకేం లక్ష్యం; వైర్ చేసి పారేస్తావ్, మూడు వందలు పంపమని!

'డబ్బుపోతే ఏడవకుండా వుండటానికి ఫిలాసఫీ కూడా కావాలాయేం?-నిగార్‌ని చూస్తోంటే మాకు కలిగిన గగుర్పాటు ఆరువందలు వస్తుంటుందని మనస్సుకు సమాధాన పరుచుకుంటాం. ఇక మిగతా వస్తువులు, పొంగిన నసీమ్ బుగ్గల్ని చూస్తూ ఉప్పొంగిపోయినప్పుడు మాకు కలిగిన ఆవేశంతో కూడిన ఆనందంకోసం అర్పించామని అనుకొంటాం' ఉమేష్ అభినయిస్తూ అన్నాడు.

'అయితే యింత రాత్రివేళ మీరంతా నా దగ్గర యీ యేడుపెందుకూ! - మీ లాడ్జికిపోయి బుగ్గల్నీ, పెదవుల్నీ ఆలోచించుకుంటూ పడుకోండి.'

వాళ్లనలుగురిలోనూ అనంతం కొంత నయం. ఏది ఎట్లావున్నా అతడికి దూరాలోచన వుంది. సినిమాకు వెళ్లగా మిగిలిన చిల్లరడబ్బులు తప్ప టెలిగ్రాము లిచ్చుకోవటానికన్నా వాళ్లదగ్గర డబ్బులేదు. అప్పిచ్చే అలవాటున్న ఫ్రెండ్స్ దగ్గర అప్పటికే చాలా తీసుకున్నారు. రూపాయి దొరకటంకూడా పెద్ద సమస్య అయిపోతుంది. రాజు దగ్గర డబ్బుకి కరువుండదు. అతడితో మంచిమాటలాడి ఏ ఫైవో వందో తీసుకుంటే మంచి పిక్చర్లకి మాత్రమే పోతూ మనియార్డర్లు వచ్చేదాకా కాలక్షేపం చెయ్యొచ్చు. అనంతం యిదంతా ఆలోచించి దీనంగా ముఖంపెట్టి నీరసంగా అన్నాడు—

'రాజూ, మా పరిస్థితి గ్రహించి నువ్వేదన్నా కాస్త సహాయం చేయాలికాని అట్లా కోప్పడితే ఏం లాభం? ముందు మాకో వంద రూపాయిలు పారెయ్. లేకపోతే పస్తులుకూడా పడుకోవలసి వస్తుంది.

ఎవళ్ళన్నా తనని సహాయం చెయ్యమని అడిగితే రాజుకి ఆనందం, గర్వంకూడా కలుగుతుంది. సిగరెట్టు ముట్టించి అయిదు నిముషాలు పొగపీలుస్తూ వదుల్తూ ఆలోచించి అన్నాడు—

'నావి ఎక్స్‌రే కళ్ళంటే నమ్ముతారా!'

'నమ్ముతాం' నలుగురూ అన్నారు - అనకపోతే డబ్బివ్వడేమోనని.

'సరే. మీ రింక లాడ్జికిపోయి పడుకోండి. పొద్దున్న ఆరుగంటలకు నాకోసం ఎదురు చూడండి - ఇదుగో, ఎక్కడ సామాను అక్కడే వుంచండి; మీరేం కదపొద్దు.

'మరి డబ్బో?' పీటు అనుమానిస్తూ అడిగాడు.

'రేపు నాతో పట్టుకొస్తా'

వాళ్లింకేం మాట్లాడకుండా వెళ్ళిపోయారు.

మర్నాడు అనుకున్నప్రకారం రాజు ఆరుగంటలకు వాళ్లలాడ్జిలో వున్నాడు. వాళ్లు వెనక వరండాలో కిందపడుకుని దొర్లుతున్నారు. గది బయట తాళంవేసుంది. గదిలోపల వెలుగుతున్న లైటు కిటికీలోంచి కనబడుతున్నది. వాళ్ళని తట్టి లేపాడు. ఉమేష్ తాళంతీసి తలుపు తెరిచాడు. లోపల వస్తువులన్నీ చిందర వందరగా పడివున్నై. స్నో సీసా జల్లు ముక్కగా బద్దలై వుంది. దానికి కొంచెం దూరంలో బిగ్‌బెన్ బోర్లాపడివుంది. క్యూటికురా పౌడరు గదంతా చల్లేసివుంది. తెరచిన పెట్టెల పక్కన రంగు రంగుల బట్టలు చీదరగా పడివున్నై. డ్రాయర్లు తెరచి వున్నై.

'మీరు సినిమాకు వెళ్ళేముందు లైటు ఆర్పలేదూ?' - కిందపడిన బిగ్‌బెన్ తీస్తూ అడిగాడు రాజు.

'రాత్రులు ఎక్కడికన్నా పోయేముందు గదిలో లైటు వెలిగించి వుంచటం, ముందు తలుపు తెరిచి వుంచటం, వరండా పిట్టగోడకు వున్న కన్నాలకు అడ్డంగా గడ్డ కట్టటం మాకు మామూలే. అట్లా చేసినందువల్ల యింట్లో ఎవ్వరూ లేరని ఎవ్వరూ అనుకోరని మా అభిప్రాయం, ఉమేష్ సగర్వంగా విన్నవించాడు. రాజు సిగరెట్టు ముట్టించి ముక్కు ద్వారా పొగవదుల్తూ, అన్నాడు.

'దొంగ తెలివైనవాడు.'

అనంతరం రాజు చెప్పే విషయాలకు నోట్ చెయ్యటం మొదలుపెట్టాడు.

'ఆరుగంటల నలభైమూడునిముషాలకు దొంగతనం జరిగింది.'

'అసంభవం. కిందవుంటున్న టైలరు తొమ్మిదయితే కాని యింటికిపోడు. పైగా ఎదురుగా ఆసుపత్రిలో నర్సులు ఆడావిడిగా అటూ ఇటూ తిరుగుతూనే వుంటారు' సీను అడ్డు తగిలాడు.

'దొంగ, నర్సులకూ టైలర్లకూ భయపడేవాడు కాదు.'

'దొంగతనం ఎప్పుడు జరిగిందో నిముషాలతో సహా నీకెట్లా తెలిసింది?'

'దొంగ హడావిడిగా సొరుగులు వెతకటంలో డ్రాయరుమీద వున్న టైంపీసు కిందపడి ఆగిపోయింది. చూడండి, యిందులో సరిగ్గా ఆరూ నలభైమూడయింది.'

'అద్భుతం!'

'దొంగ తనకు అవసరమైన వస్తువే తీసుకున్నాడు. అందువల్లే రెండు గడియారాల్లో ఒకటి మాత్రమే తీసుకున్నాడు.'

'అత్యద్భుతం!'

'దొంగకు అనవసరమైన వస్తువులంటే అసహ్యం. అందుకనే పౌడర్లూ, స్నోలూ యిట్లా విరజిమ్మి పోయాడు.'

నిగూఢమైన నిజాలను బయట పెడుతోన్న రాజు మాటల్ని ఆశ్చర్యంతో వింటున్నారా నలుగురూ.

'దొంగమేనత్త కూతురు ఎడమవైపు చెంప మీద చిన్న పుట్టుమచ్చ వుంది.'

ఉమేష్ ఒక్కగంతేసి అన్నాడు—

'ఒకేయ్, మీరు వెళ్ళి ఎడం చెంపమీద పుచ్చవున్న అమ్మాయిల్నందర్నీ పట్టి లాక్కురండి.'

వాళ్ళు లేవబోయారు. రాజు వాళ్ళను వారించి మెల్లగా అన్నాడు—

'అబ్బాయిలూ, మనకు కావలసింది దొంగ కాని దొంగ మేనత్తకూతురు కాదు.'

వాళ్ళు నిట్టూర్చి ఎక్కడివాళ్ళక్కడ కూలబడ్డారు. అనంతరం కొంత ధైర్యంచేసి అడిగాడు—

దొంగ మేనత్తకూతురికి ఎక్కడెక్కడ మచ్చలు వున్నదీ, ఆమె చుట్టుకొలత ఎన్ని అడుగుల ఎన్ని అంగుళాలువున్నదీ మాకెందుకూ? దొంగ లోపల ఎట్లా ప్రవేశించిందీ చెప్పి,వాణ్ణి పట్టుకోటానికేదైనా వుపాయంవుంటే చూడు.'

రాజు మాట్లాడకుండా పడమటివైపు కిటికీ దగ్గరకు వెళ్ళాడు. వాళ్ళు అతడిని అనుసరించారు. రాజు చెప్పటం మొదలుపెట్టాడు—

'ఈ కిటికీ పక్కగా మీ బాత్‌రూమ్‌లోంచి నీళ్ళు పోవటానికి కిందదాకా గొట్టం వుంది. దొంగ దానిమీదుగా ఎగబాకి యీ కిటికీ చేరుకుని ఆకుపచ్చ విండో బ్లయిండ్ పక్కకి లాగి లోపలకు తొంగి చూచాడు. ఎవరూ లేరు; ఇంక వాడు లోపల ప్రవేశించటంలో కష్టమేముందీ?—గంటమారుమీద మెల్లగా నడిచి ముందుకి వచ్చాడు. అక్కడ పిట్ట గోడదాటి మీరు తెలివిగా తెరచి వుంచిన గుమ్మంద్వారా గదిలో ప్రవేశించి సామాను చక్కబెట్టాడు.'

అనంతరం రాజు పాదాలమీద అడ్డంగా పడి అన్నాడు—

'నువ్వు నిజంగా షెర్లాక్ హోమ్స్‌వే!—ఆ దొంగని పట్టుకునే వుపాయంకూడా చెప్పి పుణ్యం కట్టుకుందూ.'

'వుపాయమేమిటి?—దొంగని పట్టుకోటానికి కావలసిన క్లూ దొరికింది.'

'నిజమే!'

'నా రిస్టువాచీకూడా దొరుకుతుందా?'

'డబ్బంతా......'.

'అన్నీ దొరుకుతాయి. కాని ముందు నేను చెప్పిందంతా విని ఆవిధంగా నడుచుకొంటామని వాగ్దానం చెయ్యాలి.'

'సముద్రంలో దూకమన్నా దూకుతాం'

'సినిమా వద్దంటే మానేస్తాం.'

'వెళ్ళమంటే వెడతాం.'

'ఏంచెప్తే అది చేస్తాం.'

ఏదో కష్టసాధ్యమైన పని సాధించినవాడి లాగా ఓ పెద్దగా నిట్టూర్చి గంభీరంగా ముఖం పెట్టి అడిగాడు.

'మీరు తల్లితండ్రుల్ని వదిలి యింత దూరం ఎందుకు వచ్చారూ?'

'చదువుకోసం.'

'ఇక మరిక్కడ ఆడే నాటకాలు వినండి. అమ్మా నాన్నా దూరంగా వున్నారు కదా అని నెలకు సరిపడా పంపిన డబ్బు కొంత పిక్చర్లకూ కొంత ఫేస్‌పౌడర్లకూ, వేనిషింగ్ క్రీములకూ, టూత్ పేస్టులకూ ఖర్చుపెట్టి ఇరవయ్యోతారీఖు వచ్చేటప్పటికి దమ్మిడీ లేకుండా తయారు. ఫంక్షన్ వుందనో, ఎక్స్‌కర్షన్‌కి వెళ్ళాలనో, చందా యివ్వాలనో, పుస్తకాలు కావాలనో సాకుపెట్టి డబ్బు పంపమని యిళ్ళకు వుత్తరాలు రాస్తారు. మనియార్డర్లు వచ్చేలోగా అప్పులకు బయలుదేర్తారు. అవి రాగానే ఖూల్‌చంద్ షాపులో సీమెన్స్ స్టోర్సులో పోయి బట్టలు కొనటం; అవి అలంకరించుకుని థియేటర్‌కి పోవటం. పోనీ కొంతలో కొంతన్నా ఏకాగ్రత వుందా అంటే అదీ లేదు- బొల్కానీమీదే కూర్చోవాలి; ఆ ప్లోరసెంటు దీపాలముందు తళతళా మెరిసిపోతుంటే అందరికళ్లూ జిగేలుమనాలి కాబోసు!- పైగా హాస్టల్‌కి స్వస్తి చెప్పి లాడ్జిలో వుంటం ఏకాగ్రత కోసమని తలిదండ్రులకు సమాధానం చెప్పుకోటం. మీకు కావలసింది ఏకాగ్రత ఎన్నటికీ కాదు; స్వేచ్ఛ. పైగా మీరు చదువూ సంధ్యా లేకుండా తెగ తిరగటమే కాకుండా బుద్ధిగా చదువుకొంటున్న వాళ్లని కూడా చెడగొడుతున్నారు...'

'మేమెవర్ని చెడగొట్టాం?' సీను అడిగాడు గుడ్లు మిటకరించి.

'...మీసంగతి నాకేమీ తెలీదనుకొంటున్నారు. ఇటుచూడండి—ఎవళ్లెవళ్లు ఎక్కడెక్కడ ఎప్పుడెప్పుడు ఏమేమి చేస్తున్నదీ నాకు తెలుసు. నిన్న మీరు హాస్టల్‌కి వెళ్ళి మహేశ్వర్‌నీ వాళ్ళనీ బలవంతపెట్టి పిక్చర్‌కి తీసుకుపోలే?'

అనంతం కళ్లు మూసుకున్నాడు.

ఉమేష్ తల కిందకు వంచాడు, పాపారావు నోరు తెరచి రెప్ప వెయ్యకుండా చూస్తూన్నాడు. సీను క్రాపు చెరిగిపోకుండా తల గోక్కున్నాడు.

రాజు మళ్ళీ మొదలుపెట్టాడు—

'మీరు మిమ్మల్ని గూర్చి నాకు తెలుసునను కొంటున్న విషయాలకంటె నాకెక్కువ సంగతులు తెలుసు. మీరికనించయినా వెర్రివెర్రి వేషాలు కట్టిపెట్టి బుద్ధిగా చదువుకోకపోతే మిమ్మల్ని గురించి చేటభారతాలంత ఉత్తరాలు మీ వాళ్ళకు రాసిపారేస్తాను. మీ వాళ్ళ ఎడ్రసులన్నీ నాదగ్గర వున్నై—మీకింకా తెలీదేమో.'

'ఒద్దు. మా నాన్న వీపు చిట్లకొడతాడు' అనంతం కళ్లు తెరచి దీనంగా అన్నాడు.

'మా మావయ్య నాకింక ఒక్క దమ్మిడీ కూడా పంపడు.'

'మా ఆవిడ చీపురుకట్ట తిరగేస్తుంది.'

'మా తాత యింట్లోంచి తరిమేస్తాడు' సీను ఉన్నట్టుండి ఒక్క గంతేశాడు.

'మైడియర్ హోమ్స్, నీ వుపన్యాసం కట్టిపెట్టు—దొంగని పట్టుకున్నాను' అంటూ కిందకు పరుగెత్తాడు. స్నేహితులు అతడిని అనుసరించారు. అర్థాంతరంగా వాళ్ళట్లా పారిపోవటం చూసి రాజు ఆశ్చర్యపోయాడు. వాళ్ళు నలుగురూ పంజాబీ పిల్లని మెడమీదకు మోసుకు రావటంచూసి అతడి ఆశ్చర్యం మాయమయి కోపం వచ్చింది.

'మీ యత్తపశువులు—ఎందుకా పిల్లని అట్లా హింసిస్తారూ?' రాజు మండిపడ్డాడు.

'మీ మేనత్తకూతురు ఎడమ చెంపమీద మచ్చ వుంది కాదూ!' ఉమేష్ రాజుమాటల్ని లక్ష్యపెట్టకుండా ఆ పిల్లని అడిగాడు.

ఆ అమ్మాయికి వీళ్లగొడవ అర్థంకాలేదు. పంజాబు దేశస్థురాలు కాబట్టి భయంతో గజగజ వణికిపోకుండా ధైర్యంతో అంది—

'ఉంది; దానికి నన్నెందుకు పట్టుకోటం?'

'నీకు కావలసింది పదిహేనేగా; అరువందలూ ఎందుకు కాజేశావ్?' ఆ పిల్ల చెవిమెలిపెడుతూ సీను అడిగాడు.

అతికష్టంమీద ఆ పిల్లని వాళ్లనించి వేరు చేసి రాజు అడిగాడు.

'మళ్లీ యిక్కడికి ఎందుకొచ్చావ్?'

'చిన్న చిల్లరమార్చి తెచ్చేలోగా మీరు మాయమయ్యారు. నే నడిగింది పదిహేను— మీరు యిరవై యిచ్చారు' అంటూ అయిదు రూపాయిల నోటు రాజు చేతులో పెట్టింది.

వాళ్లు నలుగురికీ యిదంతా అయోమయంగా వుంది. సీనుమాత్రం రాజుకి పంజాబీపిల్లకూ వున్న స్వల్ప పరిచయాన్ని ఆధారం చేసుకుని మనస్సులో కథ అల్లుకోవటం మొదలుపెట్టాడు. ఆ పిల్ల యిచ్చిన అయిదు రూపాయిలకు మరొక ఎనభైకలిపి ఆపిల్ల చేతులో పెట్టాడు రాజు. అమ్మాయి ముఖం ఆనందంతో బరువెక్కిపోయింది. ఏమి మాట్లాడాలో తెలీక రాజు వైపు కన్నీటిగుండా కృతజ్ఞతతో చూస్తూ నిలబడిపోయింది. రాజు జేబులోవున్న డబ్బంతా చిల్లరతో సహా బయటకుతీసి బల్లమీద పెట్టి అన్నాడు-

'తక్కినది మా యింటికివచ్చి పట్టుకెళ్లండి.'

వాళ్లు ఒకళ్లముఖాలుఒకళ్లు చూసుకున్నారు.

'నేను మొట్టమొదటే అనుకున్నాను' సీను అన్నాడు, గోడవైపు ముఖం తిప్పి.

ఉమేష్ బల్లమీద డబ్బు గబగబా లెక్కపెట్టి-

'ఇంకొక వంద వస్తుంది' అన్నాడు.

'దమ్మిడీకూడా రాదు. మీకా వంద ఫైన్ వేశాను.'

'అదెట్లా కుదురుతుంది?-అణా పైసాలతో అంతా రావలసిందే' అనంతం అన్నాడు:

'అట్లాగైతే మీ యిళ్లకు వుత్తరాలు పోతై- ఆలోచించుకోండి.'

ఇళ్లకు వుత్తరాలు వెడితే ముందుముందు కలిగే కష్టనష్టాలను బాగా ఆలోచించుకున్న మీదట వంద రూపాయలు వదులుకోటానికే నిర్ణయించారు వాళ్ళు.

'మీరు చాలా మంచివారు' కన్నీరు తుడుచుకుని పంజాబీ పిల్ల అంది.

'అవును. వీళ్ళు తప్ప అందరూ అట్లాగే అంటారు.'

ఇంత జరిగినా వాళ్ళు సినీమాలకు పోవటం మానలేదు; కాని వెళ్ళేటప్పుడు మాత్రం అడుగడుక్కీ వెనక్కి తిరిగి చూసుకుంటూంటారు.

# విశ్వాన్నావరించిన గంటలు

దే. చి. కృ.

గంటల శబ్దం వినడం అంటే ఎంతో ఆనందం. వాటి తీరుల్లో, శబ్ద తరంగాల్లో తీవ్రత, పిటిల్లో ఐక్యతచెంది ఆనందభయ ఉత్సాహాల్లో తేలిపోతూ వుంటాను.

ఇటీవల "తెలుగు స్వతంత్ర"లో హితశ్రీ గారి "ద వా లు" కథ చదివేటప్పటికి గంటల మీద మరీ మమకారం హెచ్చిపోయింది. పాపం! కోటయ్యకు ఆఫీసర్ గారి టేబిల్ గంట కొట్టడంలో ఆత్మాభిమానం దెబ్బతిన్నది. కాని, దాన్ని కొట్టటంలో ఆఫీసర్ పొందే తృప్తి, ఆనందం, స్వాతిశయం, కోటయ్యకు తెలుసు. మీటనొక్కితే 'రాకెట' యంత్రంలాగా పని చేయాలసిందే.

గంట కొట్టినప్పుడల్లా ప్రతిమనిషి అదిరిపడి చూస్తాడు. కాస్త పరిచయమైనదైతే దాని కర్తవ్యం సులభంగా గ్రహిస్తాడు. గంటల శబ్దం ప్రతి మానవుని చలింప జేస్తుంది. గంటకున్నూ మానవకున్నూ అవినాభావ సంబంధముంది. గంటలు కొట్టడంతో మానవుని దినచర్య మొదలు పెడ్తుంది. బరువైన శరీరాన్ని లాక్కెళ్ళుతుంది. పని చూపిస్తుంది. అరుగదీసి బ్రతుకును అంత మొందిస్తుంది.

ఎంత నిర్లక్ష్యం! మానవుని వెక్కిరిస్తుంది. వేళాకోళం జేస్తుంది. తన బానిసగా జేసికొని, బానిసగానే అంత మొందిస్తుంది. వాని వ్యర్థ జీవితానికన్నా అదే నయమేమో!